క్లుప్తంగా

ఘనంగా నాగుల ప్రతిష్ట



చియ్యపాడులో ప్రతిష్ఠించిన నాగ ప్రతిమలు

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలోని దళితవాడలో ఆదివారం వల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి నాగుల ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన నాగులను పునఃనిర్మించారు. ఈ క్రమంలో ఆదివారం నాగుల పునః ప్రతిష్ట హోమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొని నాగుల పునఃప్రతిష్ట పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

తల్లిదండ్రుల రుణం తీర్చలేనిది



తల్లిదండ్రుల పాదాలు కడుగుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రవీంద్ర హైస్కూల్‌లో ఆదివారం జననీ జనకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి పూలతో పూజించి.. వారికి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు పల్లేటి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఎంత సేవ చేసినా ఆ రుణం తీరదని వారి ప్రేమ, ఆప్యాయత, త్యాగాలకు ఏది సాటిరాదని, వారి గొప్పతనాన్ని వివరించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచిన తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పల్లేటి విష్ణుకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినీ నటుడికి సత్కారం



నటుడు దావూద్‌ను సత్కరిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు : సినిమా, టీవీ నటుడు దావూద్ తన స్వస్థలం ప్రొద్దుటూరుకు వచ్చారు. ఆదివారం ప్రముఖ సాహితీ వేత్త జింకా సుబ్రహ్మణ్యంను ఆయన స్వగృహంలో నటుడు దావూద్ మర్యాద పూర్వకంగా కలిశారు. జింకా సుబ్రహ్మణ్యంతో సినిమా ముచ్చట్లు.. భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి దావూద్ వివరించారు. ఈ సందర్భంగా దావూద్‌కు జింకా సుబ్రహ్మణ్యం శాలువా కప్పి సత్కరించారు. దావూద్ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సుబ్రహ్మణ్యం ఆకాంక్షించారు.

ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే



చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఐలమ్మ కాలనీకి చెందిన వాహన చోదకుడు మాధవ్ కుమార్తె, కుమారుడి కేశ ఖండన మహోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, కె.రమణారెడ్డి, ఆర్.వి.సాయికృష్ణ, పోలిరెడ్డి, రమేష్‌బాబు, కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సునీల్, సుధాకర్‌రెడ్డి, సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 18, 20 స్త్రీ, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్త్రీ, పురుషులకు 100 మీటర్లు, 200 మీ., 400 మీ., 800 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీలలో క్రీడాకారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్ బాషా తెలిపారు. వీరు ఆగస్టు 09, 10, 11వ తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు నాగూర్ బాషా, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, శంకర్, బి.బాషా, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, కోచ్ వివేకానంద రెడ్డి, సీనియర్ క్రీడాకారులు రబ్బాని, భార్గవ్ పాల్గొన్నారు.

ఈశ్వరీదేవి మందిరం.. పునర్నిర్మాణం

- అంచనా వ్యయం రూ.3 కోట్లు
- భక్తులు సహకరించాలని నిర్వాహకులు పిలుపు



బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవి మందిరం

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మనుమరాలు శ్రీ ఈశ్వరీదేవి సజీవ సమాధి నిష్ఠ వహించిన ప్రాంతం దివ్య మఠంగా విరాజిల్లుతోంది. అమ్మవారు భక్తుల కొంగు బంగారమై నీరాజనాలు అందుకుంటున్నారు. రోజురోజుకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. అందుకు అనుగుణంగా మఠాన్ని అభివృద్ధి చేయాలని నిర్వాహకులు సంకల్పించారు. ఈశ్వరీదేవి మందిరాన్ని దాదాపు 300 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థ దశకు చేరుకుంది. వర్షం వస్తే.. తీవ్ర ఇబ్బందులే. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పునర్నిర్మించాలని భావిస్తున్నారు. మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ఆశీస్సులతో శిష్యులు, భక్తబృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. అంచనా వ్యయం రూ.3 కోట్లుగా నిర్ణయించారు. ఇందుకోసం వారు దేవదాయ శాఖ సహకారాన్ని కోరారు. దేవదాయ శాఖ సాయం చేయడానికి ఒప్పుకొంది. రూ. 3 కోట్లను సీజీఎఫ్ నిధుల కింద మంజూరు చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. అయితే ఇందుకోసం 20 శాతం (రూ.60 లక్షలు) మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ నిధి మఠం తరఫున దేవదాయ శాఖకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. రూ. 60 లక్షలు డిపాజిట్ చేస్తేనే.. వాటితో కలుపుకొని మొత్తం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేస్తుంది. అంటే దేవదాయ శాఖ రూ.2 కోట్ల 40 లక్షలు విడుదల చేయనుంది. రూ. 60 లక్షలు డిపాజిట్ చేయడానికి మఠం దగ్గర నిధులు లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఇందుకోసం భక్తుల నుంచి విరాళాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. రూ. లక్ష నుంచి 40 లక్షల వరకు ఇచ్చిన వారి పేర్ల మీద శాశ్వత సేవలు చేయనున్నట్లు చెప్పారు.

అందరూ భాగస్వాములు కావాలి



జగన్మాత ఈశ్వరీదేవి శిలా మందిరం నిర్మించబోతున్నాం. ఈ పుణ్యమైన సేవ ద్వారా భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించబోతున్నాం. ఈ పవిత్ర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ముఖ్యంగా దాతలు, భక్తులు విరివిగా సహకరించాలి. ఇందుకు మార్గదర్శకంగా డొనేషన్ వివరాలతో భక్తులకు పాంప్లెట్లు అందించాం. ఎంత మొత్తం విరాళం సమర్పిస్తే.. ఏ విధమైన ప్రాధాన్యతలు దాతలకు లభిస్తాయో పేర్కొన్నాం. ఇందులో పేర్కొన్న తక్కువ లేదా ఎక్కువ మొత్తాలను కూడా మఠం ఆదరిస్తుంది. ఈ వివరాల కోసం మఠం ఫోన్ నంబర్: 9490486064ను సంప్రదించగలరు.

– వీరశివకుమారస్వామి, మఠాధిపతులు, ఈశ్వరీదేవి మఠం

సంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : సంప్రదాయబద్ధంగా గణపతి ఉత్సవాలు నిర్వహించాలని బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్, నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు, యువ సంఘాలు, ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విరజానంద స్వామి మాట్లాడుతూ హైందవుల పండుగలలో వినాయక చవితి ప్రముఖమైనదని, ఈ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలన్నారు. హిందూ ధర్మం, సంప్రదాయాల ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులందరూ నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో నిమజ్జన శోభాయాత్రలో పాల్గొనాలని తెలిపారు. హిందూ ధర్మరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులకు ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, సందు శివనారాయణ, వ్యాపార వేత్త దండపాణి, నగర గణేష్ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు సి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి రెడ్డి కుమార్, ట్రెజరర్ నాగమునిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చౌడయ్య, సురేంద్ర, వెంకటసుబ్బారెడ్డి, రమేష్, కొండయ్య పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

గోపవరం : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ ధనలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అధికారులు పర్యటించి సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉందని, అలాంటప్పుడు అధికారులు లేకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రామనాథ రెడ్డి మాట్లాడుతూ గత సమావేశంలో తీర్మానించిన అంశాలు ఏ మేరకు పరిష్కారమయ్యాయో ఆయా శాఖల అధికారులు ఎలాంటి నివేదిక ఇవ్వలేదన్నారు. ఇకమీదట ప్రతి మూడు వారాలకోసారి ప్రభుత్వ పథకాలపై అమలుపై నివేదిక అందజేయాలన్నారు. మండలంలోని ఆరు రైతు సేవాకేంద్రాలకు ఒక్కరినే నియమించడంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఇద్దరు వ్యవసాయ విస్తరణాధికారులకు ఇన్‌చార్జి ఇవ్వాలని సభ్యులు కోరారు. ఉన్నతాధికారుల నుండి అనుమతి తీసుకుని సిబ్బందిని కేటాయించాలని ఏఓ విజయరావును ఎంపీడీఓ ఆదేశించారు. పీ4 పాలసీ కింద బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శుల ఎంపిక, లబ్ధిదారుల నమోదు కార్యక్రమాలు వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. సమావేశంలో ఎంఈఓ చెన్నయ్య, ఏఓ విజయరావు, ఇన్‌చార్జి పీఆర్ ఏఈ చిట్టిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీహరి, ఏపీఓ విజయమ్మ, ఈఓపీఆర్‌డీ హసీనా, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కాంట్రాక్టు అధ్యాపకులను కూటమి ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంట్రాక్టు లెక్చరర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయించామన్నారు. 12 నెలల వేతనాన్ని పొందేలా ఉత్తర్వులను ఇప్పించి అమలు చేయించామని తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరణ చేసే వరకు వారికి అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సమావేశంలో ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎస్సార్ వెంకటజనార్దన్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పోలు నాగేంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జిలానీ, మహబూబ్‌బాషా, రామకృష్ణ, రామ మోహన్, చిన్నయ్య, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తున్నా పట్టించుకోరేం?



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ

ప్రొద్దుటూరు : యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ 47 కేజీల యూరియా బస్తా రూ.360కు అమ్మాల్సి ఉండగా రూ.470కిపైగా అమ్ముతున్నారన్నారు. యూరియా కొరత ఉందని, ఎక్కువ ధరకు ఫర్టిలైజర్స్ షాపుల వారు అమ్ముతున్నారని చెప్పారు. పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ఫర్టిలైజర్ షాపుల వారు మాత్రం రూ.కోట్లు గడించి రైతులతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగు మందులను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఎకరాకు మూడు బస్తాలు అవసరమవుతాయని, కానీ ప్రభుత్వం ఒక బస్తా ఇచ్చి చేతులు దులుపుకొంటోందన్నారు. ప్రభుత్వమే మూడు బస్తాల యూరియా అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రవితేజ, చెన్నారెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఉద్యోగులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని హోలిస్టిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 150 మంది ఉద్యోగులు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్ వ్యాధి, గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ రాజశేఖర్ వర్మ, డాక్టర్ బీఎల్ఎన్‌రెడ్డి, డాక్టర్ నాగశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహారావు, పీఆర్ఓ ప్రతాప్, సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్వర్టులు ఇలా.. సాగునీరు వెళ్లేదెలా?



నక్కలదిన్నె వద్ద కల్వర్టు వద్ద నీరు కిందకు రాకుండా పేరుకుపోయిన వ్యర్థాలు



వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల కల్వర్టు నుంచి కిందకు వెళ్లని సాగునీరు

చాపాడు : గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ముందుగానే రైతాంగం కోసం కేసీ కెనాల్, చాపాడు కెనాల్‌కు సాగునీటిని విడుదల చేశామని టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు వాఖ్యలు చేశారు. అయితే విడుదల చేసిన నీరు రైతాంగానికి పూర్తి స్థాయిలో అందుతుందా అనే విషయం మాత్రం వీరు పట్టించుకోలేదు. చాపాడు కాలువ కింద ఉండే మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామం వద్ద గల కల్వర్టులో వ్యర్థాలు పేరుకుపోయి కిందికి సాగునీరు వెళ్లడం లేదు. దీంతో పైతట్టులో అధికమైన నీరంతా పొలాల్లోకి వెళ్లి రైతులకు ఇబ్బంది మారింది. మూడు రోజుల క్రితం చాపాడు వద్ద ఒకటో నెంబరు కాలువ కల్వర్టు పూడిపోయి గ్రామంలో నీరంతా ఇబ్బందికరంగా మారంగా, ఇప్పుడు నక్కలదిన్నెలోని కల్వర్టులో పూడిక, వ్యర్థాలతో నిండిపోవడం వలన సాగునీరు కిందికి వెళ్లడం లేదని, దీనిని సంబంధిత అధికారులు బాగు చేసి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందేలా చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

నేడు వెదురూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో జేఈ నరేంద్ర తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయడం జరుగుతుందన్నారు. ఈ సబ్‌స్టేషన్ వద్ద పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని జేఈ కోరారు.

నేడు విద్యుత్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్ : మండలంలోని రాజువారిపేట పంచాయతీ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కాలనీలలో విద్యుత్ బకాయిల వసూళ్లకు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్ కో జేఈ నరేంద్ర తెలిపారు. ఉదయం 8గంటల నుంచి విద్యుత్ బకాయిల వసూళ్లకు ట్రాన్స్ అధికారులు పర్యటిస్తారని బకాయిలు చెల్లించాలని జేఈ కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం రాచమల్లు శివప్రసాదరెడ్డిని దొరసానిపల్లెలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డికి శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ మండల ఉపాధ్యక్షుడు జంగమయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల జనరల్ సెక్రటరీ నంద్యాల రవీంద్రారెడ్డి రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలూరు ఇంద్రసేనారెడ్డి, నంద్యాల ప్రతాప్‌రెడ్డి, ముదిరెడ్డి పల్లె వెంకటసుబ్బారెడ్డి, ఎస్.లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేది ఎప్పుడో?



వేమలూరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అట్లూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేది ఎప్పుడో చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి ప్రశ్నించారు. వేమలూరు పంచాయతీలోని వేమలూరు, దిప్పపాపాయిపల్లె, వేమలూరు ఎస్సీ కాలనీల్లో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంత వరకూ సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అందరికీ అందలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుండి ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ వచ్చారని గుర్తు చేశారు. ఏడాది దాటినా ఇంత వరకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఏ పథకం అందించిన దాఖలాలు లేవన్నారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు రాజవోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ ముడమాల గోవర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మునెయ్య, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, మునిరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అందరికీ సంక్షేమం



పెండ్లిమర్రిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలసపాడు : జగనన్న పాలనలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని, కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.సుదర్శన్, ఉపాధ్యక్షులు సుధ రామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, అంకన గురివిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పిడుగుపల్లె సచివాలయ పరిధిలోని పిడుగుపల్లె, పెండ్లిమర్రి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, రైతు భరోసా తదితర పథకాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలను ఆర్థికంగా ప్రగతి సాధించేలా చర్యలు తీసుకుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ఏవీ భాస్కర్ రెడ్డి, సింగరయ్య, రాంబాబు, అంకిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీరాములరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న రమణారెడ్డి

పోరుమామిళ్ల : ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించి ఇబ్బందులకు గురిచేయడమే ధ్యేయంగా పాలకులు పని చేస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, సీపీయస్ కమిటీ కన్వీనర్ సుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. పోరుమామిళ్ల ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. డీఏలు, ఐఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం, పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. 12 వ పీ ఆర్సీ కమిటీని నియమించి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు జరిగి రెండు నెలలు కావస్తున్నా పొజిషన్ ఐడీలు లేక రెండు నెలల జీతాలు ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తామని చెబుతూనే యాప్‌లు, ఆన్‌లైన్ నమోదు, శిక్షణ, రిపోర్టుల తయారీ పనులతో బోధనా సమయాన్ని హరించి వేస్తున్నారన్నారు. ఇదే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతాయన్నారు. మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పరిమాణం పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నాయకులు చంద్రహాసరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, పుల్లయ్య, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, దేవరాజు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ హామీని నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతోపాటు, పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు గళం విప్పి నిధులు రాబట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని కోరారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కడప మహానేడు వేదికగా పది రోజుల్లో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని చెప్పి వెళ్లినా..పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేయని పక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షుడు యువరాజ్, సుధాకర్, నరసింహ, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి పాస్ట్రేట్ కమిటీ ఎన్నిక



సీఎస్ఐ చర్చి డీనరీ చైర్మన్‌తో నూతన పాస్ట్రేట్ కమిటీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చి పాస్ట్రేట్ కమిటీ సెక్రటరీగా ఇమ్మరాజు విలియం బెనహర్, ట్రెజరర్‌గా నాగదాసరి చెన్నరాయుడు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఎస్ఐ చర్చిలో డీనరీ చైర్మన్ రెవ.వేల్పుల ప్రసాద్, ప్రెస్బిటర్ రెవ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాస్ట్రేట్ కమిటీ ఎన్నిక జరిగింది. సెక్రటరీగా ఇమ్మరాజువిలియం బెనహర్, ట్రెజరర్‌గా నాగదాసరి చెన్నరాయుడు, కౌన్సిల్ మెంబర్స్‌గా జనరల్ విభాగం నుంచి పెద్దీటి రవిసుధాకర్‌బాబు, మహిళా విభాగం నుంచి ఎ.మేరీజయశీల, యూత్ విభాగం నుంచి రాజాలారెన్స్, డీనరీ కమిటీ సభ్యులుగా అల్లూరిసుధాకర్, వీరదాసరివసుంధరపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు జింకాశాంతమ్మ, సమ్మెటవిజయ్య నామినేటెడ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ మూడు సంవత్సరాల కాలం పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా విలియంబెనహర్, చెన్నరాయుడు మాట్లాడుతూ తమపై విశ్వాసంతో తమ ప్యానెల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన సీఎస్ఐ సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తమ కమిటీ ఆధ్వర్యంలో సంఘ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటులో ద్వంద్వ వైఖరి విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో కూటమి నాయకులు ద్వంద్వ వైఖరి విడనాడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రమోహన్ రాజు అన్నారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పనంగా అప్పజెప్పే కుట్రలో భాగంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు తడిసి మోపెడై భారంగా మారాయని, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగించిన బిల్లు కన్నా అదనపు భారం పడుతోందని అన్నారు. నాడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు నేడు ఎందుకు సమర్థిస్తున్నారో ప్రజానీకానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, రామరాజు, బాబు, విజయరావు, నారాయణ, చంద్రపాల్, జయపాల్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.